ఎంపీ ఈటల పరామర్శ



బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

రామంతాపూర్ : గోఖలేనగర్‌లో గత ఆదివారం రాత్రి జరిగిన దుర్ఘటనలో మృతి చెందిన రామంతాపూర్, హబ్సిగూడవాసులు కృష్ణయాదవ్, సురేష్‌యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, రుద్ర వికాస్ కుటుంబాలను ఆదివారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారంతో పాటు కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించేలా కృషి చేస్తానని, వారికి హామీ ఇచ్చారు. కార్పొరేటర్ బండారు శ్రీవాణితో పాటు యాదవ సంఘం ప్రతినిధులు సర్వబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ ఎల్‌ఓసీల అందజేత



ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా మంజూరైన ఎల్‌ఓసీ పత్రాలను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి బాధిత కుటుంబసభ్యులకు ఆదివారం క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఈస్ట్ ఆనంద్‌బాగ్‌కు చెందిన మల్లికార్జున్‌కు రూ.2 లక్షలు, గౌతంనగర్ డివిజన్‌కు చెందిన ప్రియాంకకు రూ.2.5 లక్షలు మంజూరయ్యాయి. చిన్నాయాదవ్, రాముయాదవ్, ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

బోడుప్పల్: ప్రజాప్రతినిధులు, నాయకులు సేవా కార్యక్రమాల్లో ముందుండాలని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్ అన్నారు. 19వ డివిజన్‌లోని ఈస్ట్ బృందావన్‌కాలనీ పార్కు స్థలంలో డివిజన్ ఇన్‌చార్జి బొమ్మక్ శ్రీనివాస్ కుమారుడు బొమ్మక్ సందేశ్ జ్ఞాపకార్థం రూ.10 లక్షలతో నిర్మించిన మండపాన్ని ఆదివారం వారు ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహ్మారెడ్డి, మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పొన్నం తరుణ్‌గౌడ్, బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ బొమ్మక్ కల్యాణ్‌కుమార్, రాసాల వెంకటేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శాంతి

గౌతంనగర్: డివిజన్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్ అన్నారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు గౌతంనగర్ చౌరస్తా నుంచి రైల్వేగేట్ వరకు రూ.7 లక్షలతో చేపట్టిన మరమ్మతు పనులను కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సహకారంతో గౌతంనగర్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు.

మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డికి పితృవియోగం

హబ్సిగూడ: ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తండ్రి బేతి చంద్రారెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆదివారం తుదిశ్వాస విడిచారు. అంత్యక్రియలు మల్లాపూర్ శ్మశానవాటికలో జరగనున్నాయి.

రక్తదాన శిబిరం



ఉప్పల్: ఓ శాంతి ఓం ఆధ్వర్యంలో అప్పురూప జగపతి హైట్స్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ హాజరై ఆదివారం కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఆధునిక హంగులతో వైకుంఠధామం

పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణం | అన్ని వర్గాల ప్రజలకు మౌలిక సదుపాయాలు | అధికంగా ఫీజు వసూలు చేస్తున్నారని ఆరోపణలు



పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా..

బోడుప్పల్ : నగర పాలక సంస్థ పరిధిలోని దేవేందర్‌నగర్‌లో ఉన్న వైకుంఠధామాన్ని ఆధునిక హంగులతో ఏర్పాటు చేశారు. సుమారు రెండెకరాల స్థలంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలతో పాటు పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ వైకుంఠధామం ఉంది. పేద, మధ్యతరగతి ప్రజలు నివసించే ఈ ప్రాంతంలో వైకుంఠధామాన్ని ఏర్పాటు చేసి అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇక్కడకు వచ్చే ప్రజల అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తున్నారు. పేద, మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని ఉచిత వైకుంఠ రథాన్ని కూడా ఏర్పాటు చేశారు.

రూ.41.20 లక్షలతో అభివృద్ధి

పేద ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 2019 ఆగస్టు 14న ఈ వైకుంఠధామాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపల్ సాధారణ నిధులు రూ. 41.20 లక్షలతో అప్పటి మున్సిపల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి(మాజీమంత్రి) చొరవతో నిర్మించారు. పేద, మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని ఈ సదుపాయాలను కల్పించారు.

పార్కును తలపిస్తూ.. ఆహ్లాదకరంగా

వైకుంఠధామంలో పచ్చని బయళ్లు ఉన్నాయి. నీడనిచ్చేందుకు చెట్లు, అందంగా కనిపించేందుకు, సువాసనలు వెదజల్లేందుకు వివిధ రకాల మొక్కలను పెంచారు. పచ్చిక బయళ్లలో కూర్చునేందుకు బెంచీలను ఏర్పాటు చేశారు. అన్ని రకాల చెట్లు పెంచడంతో సుందరమైన వాతావరణం నెలకొంది. దహన సంస్కారాలకు వచ్చే వారికోసం ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించారు.

అన్ని రకాల సదుపాయాలు

దహన సంస్కారాలకు వచ్చే వారి ఆత్మీయుల కోసం అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నారు. నగర పాలక సంస్థ వాటర్ ట్యాంక్ నిర్మించి నీటి సౌకర్యం కల్పించింది. స్నానాల గదులు, టాయిలెట్స్, దింపుడు గళ్లం, డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేశారు. సేద తీరేందుకు చెట్ల కింద బెంచీలను ఏర్పాటు చేశారు. పచ్చని చెట్లు పెంచడంతో వేసవి కాలంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేలా ఇక్కడ ఏర్పాట్లు ఉన్నాయి.

దహన సంస్కారానికి దాదాపు రూ.25 వేలు..

పేద, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని వైకుంఠధామాన్ని నిర్మించారు. కానీ దహన సంస్కారాలు నిర్వహించే వ్యక్తులు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంబర్‌పేట్ వైకుంఠధామం కంటే ఎక్కువ వసూలు చేస్తున్నారని, పలువురు పేర్కొంటున్నారు. పేదల కోసం ఏర్పాటు చేసిన ఈ వైకుంఠధామంలో ఒక వ్యక్తి దహన సంస్కారానికి రూ.20 నుంచి 25 వేల వరకు వసూలు చేస్తున్నట్లు పలువురు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.



దేవేందర్‌నగర్‌లోని వైకుంఠధామం

అధిక ఫీజు వసూలు చేస్తున్నారు..



దేవేందర్‌నగర్ కాలనీలోని వైకుంఠధామంలో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయి. ఈ వైకుంఠధామాన్ని దేవేందర్‌నగర్ ఫేస్ 1,2, అంబేడ్కర్ నగర్ ఫేస్ 1,2,3, రాజీవ్‌నగర్ ఫేస్ 1,2, గౌతమీనగర్ ప్రజలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేశారు. నీటి సౌకర్యం, టాయిలెట్లతో పాటు పచ్చని చెట్లు ఉన్నాయి. కానీ దహన సంస్కారాల ఖర్చులు మాత్రం పేదలు భరించలేని స్థాయిలో ఉన్నాయి.

– వెంకటేష్, న్యూ అంబేద్కర్‌నగర్

అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నాం...



వైకుంఠధామానికి దహన సంస్కారాల నిమిత్తం వచ్చే వారి కోసం అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నాం. దహన సంస్కారాల కోసం పెద్దఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నారని మా దృష్టికి వచ్చింది. దీనిపై బోడుప్పల్ నగర పాలక సంస్థ పెద్దల దృష్టికి తీసుకెళ్లి పేద, మధ్యతరగతి ప్రజలకు దహనసంస్కార ఖర్చులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం.

– శైలజ, కమిషనర్ బోడుప్పల్

గణేష్ ఉత్సవ కమిటీ కన్వీనర్‌గా విజయ్

బోడుప్పల్: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి బోడుప్పల్ కన్వీనర్‌గా విజయ్ నియమితులయ్యారు. ఈ మేరకు బోడుప్పల్‌లో ఆదివారం జరిగిన ఉత్సవ సమితి సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. మాజీ కన్వీనర్ జడిగె సుధాకర్, కమిటీ సభ్యులు గోనె శ్రీనివాస్, సామల పవన్‌రెడ్డి, కొత్త కిరణ్‌గౌడ్, దేవరకొండ వీరాచారి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

గణపతి విగ్రహాల పంపిణీ



వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: వినాయక చవితి పండుగను సాంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ కోరారు. ఆదివారం శివపురికాలనీలోని ఆయన కార్యాలయం వద్ద వినాయక మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వినాయక చవితి పండుగను చిన్నారులతో కలిసి నిర్వహించుకుని సంస్కృతి సాంప్రదాయాల విలువలను తెలియజేయాలన్నారు. వర్ధని, పార్వతి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో సమస్యల పరిష్కారం



విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న నాయకులు

మల్కాజిగిరి: బ్రాహ్మణులు ఐకమత్యంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కరించుకోగల్గుతామని, బ్రాహ్మణ ఐక్యవేదిక కో– ఆర్డినేటర్లు ఆంజనేయ ప్రసాద్‌శర్మ, రుద్రవీణ బాలకృష్ణ అన్నారు. ఆదివారం ఆనంద్‌బాగ్‌లోని లలితాపరమేశ్వరి ఆలయ కమ్యూనిటీహాల్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మల్కాజిగిరిలో బ్రాహ్మణ భవన్ కోసం భూ కేటాయింపు చేయడానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తెలిపారన్నారు. మిగతా ప్రజాప్రతినిధులను కూడా మద్దతుగా కలుస్తామన్నారు. బ్రాహ్మణ సంఘాలు ఏకగ్రీవంగా మద్దతు పలకాలని విస్తృత భాగస్వామ్యం పెంచడానికి నియోజకవర్గంలోని 9 డివిజన్లలో సబ్ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. రఘుకిరణ్, రామకృష్ణ, తులసీరమణాచార్యులు, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌టీయూ నూతన కమిటీ



నూతన కమిటీ సభ్యులను సత్కరిస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: మల్లాపూర్ ట్యాక్సీ సెక్టార్ బీఆర్‌టీయూ నూతన కమిటీని ఆదివారం బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నగేష్‌కుమార్, పంజా రాజుయాదవ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా పీఆర్.ప్రవీణ్, హమాలీ శ్రీనివాస్, అధ్యక్షులుగా రాంపల్లి మహేందర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా మేడి శివారెడ్డి, బొడిగే రాజుగౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా భూపతి అశోక్, మర్రిపెద్ది అశోక్‌గౌడ్, కోశాధికారిగా వెంకటేష్‌గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా తిరుపతి, నాగరాజు, రమేష్, కిషోర్, మోహన్, రాముగౌడ్, సోషల్ మీడియా ఇన్‌చార్జి కొంపల్లి రవిలను ఎన్నుకున్నారు. అనంతరం మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి వారిని సత్కరించారు.

అలరించిన నృత్య ప్రదర్శన



ఉప్పల్ మినీ శిల్పారామంలో ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. జర్మనీ నుంచి వచ్చిన కళాకారులు మాస్టర్ శంకర్ శ్రీపతి పండతారాధ్యులు వయోలిన్‌పై వర్ణం, రామకృతి, కష్టనీ బెగానే అంశాలను పలికించారు. అనన్య శ్రీపతి పండితారాధ్యుల భరతనాట్య ప్రదర్శనలో గణపతి కౌతం, రాజరాజేశ్వరి అష్టకం, తిల్లాన, తదితర అంశాలను ప్రదర్శించి మెప్పించారు.

నల్ల చెరువు 'బేబీ పాండ్' సందర్శన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీ పద్మజ, ఏసీపీ చక్రపాణి తదితరులు

ఉప్పల్: పండుగ సమీపిస్తున్న కొద్ది వినాయక పండగ ఏర్పాట్లపై అధికారులు దృష్టిసారించారు. ఆదివారం ఉప్పల్ నల్ల చెరువు వద్ద నిర్మించిన బేబీ పాండ్‌ను మల్కాజిగిరి డీసీపీ పద్మజారెడ్డి ఏసీపీ చక్రపాణితో కలిసి పరిశీలించారు. అప్పటికే కొలనులో ఉన్న మురుగు నీటిని జీహెచ్‌ఎంసీ సిబ్బంది తొలగించడం ప్రారంభించారు. కొలను వద్ద భద్రత, సౌకర్యాలపై డీసీపీ ఆరా తీశారు. అనంతరం దేవేందర్‌నగర్ డంపింగ్ యార్డు వద్ద ఏర్పాటు చేసే కృత్రిమ పాండ్ ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, ఎస్సై మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్చక సంఘాల్లో బీసీలకు పెద్దపీట

హబ్సిగూడ: అర్చక సంఘాల్లో బీసీ వర్గాలకు పెద్దపీట వేశామని తెలంగాణ అర్చక సమాఖ్య నాయకులు పేర్కొన్నారు. ఆదివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ గంగ ఉపేంద్రశర్మ మాట్లాడుతూ.. సంఘాల్లో బీసీలకు పెద్దపీట వేశామని, తెలంగాణ అర్చక సమస్యల పరిష్కారానికి అనేక న్యాయ పోరాటాలు చేసినట్లు పేర్కొన్నారు. పోరాటాల ఫలితంగానే దూపదీప నైవేద్య పథకం అమలులోకి వచ్చిందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు గట్టు శ్రీనివాసాచార్యులు, ఆనంద్‌శర్మ, శ్రీనివాసాచార్యులు, నారాయణ, శ్రీనివాస్, సుదర్శన్, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కుటుంబ ఆశీర్వాద పండుగ

మల్కాజిగిరి: పీవీఎస్ కాలనీలోని బీఎస్‌ఈ క్రిస్టియన్‌హాల్‌లో హోసన్నా ఫెయిత్ చర్చ్ ఆధ్వర్యంలో కుటుంబ ఆశీర్వాద పండుగ కార్యక్రమం నేడు సాయంత్రం 6.30 గంటలకు జరుగుతుందని పాస్టర్ కరుణకిరణ్ ప్రకటించారు. ఈ సందర్భంగా హెచ్‌పీఎఫ్‌ఎం సికింద్రాబాద్‌కు చెందిన పాస్టర్ జాయ్ సందేశం ఉంటుందని వివరించారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

కుషాయిగూడ: ఓ గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని చర్లపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో ఓ వృద్ధుడు విగతజీవిగా పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వృద్ధుడిని పరిశీలించగా.. అప్పటికే అతడు మృతిచెందాడు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడు సుమారు 60–65 ఏళ్లు ఉంటాడని, గత పది రోజులుగా చర్లపల్లి రైల్వేస్టేషన్ పరిసరాల్లో బిక్షాటన చేసుకుంటూ ఉండేవాడని పోలీసులు తెలిపారు. ఒంటిపై ఎలాంటి గాయాలు లేవని, ఆకలి, ఆరోగ్య సమస్యలతో మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మల్లాపూర్ భాగ్యనగర్ గణేష్ నూతన కమిటీ

మల్లాపూర్: మల్లాపూర్ ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ ఫంక్షన్‌హాల్‌లో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సమావేశం ఆదివారం నిర్వహించారు. మల్లాపూర్ కన్వీనర్‌గా అల్లాడి కృష్ణయాదవ్. కో–కన్వీనర్‌గా క్రాంతికుమార్, సీతాల విజయ్‌కుమార్, నిర్మల, రామయ్య, కో–ఆర్డినేటర్లుగా ఎల్లేష్‌యాదవ్, శశికాంత్‌పటేల్, వెంకట్‌రెడ్డి, నర్సింగ్‌రావు, రాజులను ఎన్నుకున్నారు. అనంతరం కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి కమిటీ సభ్యులను సత్కరించారు.

అవార్డు ప్రదానం



అవార్డును అందుకుంటున్న రామరాజేష్

మల్లాపూర్: జీహెచ్‌ఎంసీ కాప్రా సర్కిల్ ఎస్‌ఎఫ్‌ఏ రామ రాజేష్‌కు స్వర్ణ నంది– 2025 అవార్డు లభించింది. కీర్తి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ సరస్వతి పరిషత్‌హాల్‌లో అవార్డును మాజీ ఇరిగేషన్ చైర్మన్ వేణుగోపాలాచారి, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. చెత్త పాయింట్ల వద్ద చెత్త వేయకుండా చేస్తున్న కృషికి అవార్డు లభించింది. కీర్తి ఆర్ట్స్ ఫౌండేషన్ అధ్యక్షురాలు బిందు, బీఆర్‌టీయూ కాప్రా సర్కిల్ అధ్యక్షులు కుర్మన్న తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్స్ జేఏసీ ఏర్పాటు



మల్లాపూర్: నాచారం డివిజన్‌లోని అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్స్ జేఏసీని ఆదివారం ఏర్పాటు చేసుకున్నారు. నాచారం బీఎస్‌ఏ కార్యాలయంలో అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు సమావేశం నిర్వహించారు. అపార్ట్‌మెంట్స్‌లో రెసిడెంట్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడేందుకు జేఏసీని ఏర్పాటు చేసుకున్నామన్నారు.

వీరే నూతన కమిటీ సభ్యులు..

అపార్ట్‌మెంట్ కో– ఆర్డినేటర్‌గా కళ్యాణ్ కుటీర్, ఏ బ్లాక్ అధ్యక్షుడిగా వెంకటేష్‌ను ఎన్నుకున్నారు. జేఏసీ సలహాదారులుగా నల్లారాధాకృష్ణ, ప్రతినిధులుగా సత్యనారాయణ, రామకృష్ణరాజు, భాస్కర్‌గుప్తా, రణ్‌ధీర్‌రెడ్డి, రాఘురామకృష్ణ, కామేశ్వరావు, అనురాధ, కరుణాకర్, భవానీఅశోక్, పరమేష్, వేణు, రాధాకృష్ణ, భాషా తదితరులున్నారు.



అ'పూర్వ' సమ్మేళనం

మల్కాజిగిరి: జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదోతరగతి 2004 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. ఈ కార్యక్రమానికి హాజరైన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు హనుమయ్య, సుదర్శన్‌లు మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థుల సమ్మేళనంతో గత రోజులు గుర్తుకొచ్చాయన్నారు. ఆనాడు ఉన్న పరిస్థితులు ఇప్పుడు లేవన్నారు. ప్రభుత్వ స్కూళ్లల్లో చదివిన విద్యార్థులు చదువుతో పాటు వినయవిధేయతలు నేర్చుకుంటారన్నారు. అనేకమంది ప్రభుత్వ, ప్రైవేట్‌లో ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారని, వారంతా సామాజిక బాధ్యతగా పాఠశాలల విద్యార్థులకు చేయూతనందించాలన్నారు. పూర్వ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విశ్రాంత ఉపాధ్యాయులు హేమలత, షీలా, రాములు, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక హంగులతో ముదిరాజ్ భవన్



అధికారులతో కలిసి భవనాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: అసంపూర్తిగా ఉన్న ఉప్పల్ ముదిరాజ్ భవనాన్ని ఆధునిక హంగులతో నిర్మించి, అన్ని రకాల వసతులు కల్పిస్తామని ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం ముదిరాజ్ సంఘం ప్రతినిధుల ఆహ్వానం మేరకు ఆమె వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భవన నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తామని, ఆధునిక హంగులతో సాధ్యమైనంత త్వరలో నిర్మాణం పూర్తి చేయించి, అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేయనున్నట్లు వివరించారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎంటీఎస్ రైళ్ల సమయం మార్చాలి

మల్కాజిగిరి: సెప్టెంబర్ 3న జరిగే జోనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల సలహా సమితి సమావేశంలో పలు అంశాలను ప్రస్తావిస్తానని రైళ్ల ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు నూర్ తెలిపారు. ఎంఎంటీఎస్ రైళ్ల సమయం మార్చాల్సిన అవసరం ఉందన్నారు.

- కాచిగూడ నుంచి బెంగళూరు వెళ్లే వందేభారత్ రైలును, కర్నూల్ వెళ్లే తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైలును మేడ్చల్ లేదా బొల్లారం నుంచి ప్రారంభించాలన్నారు.
- అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను మల్కాజిగిరిలో హాల్టింగ్ సౌకర్యం కల్పించడం వలన సికింద్రాబాద్, కాచిగూడ, చర్లపల్లి స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ తగ్గుతుందన్నారు.
- విశాఖపట్నం మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌ను కర్నూల్ వరకు పొడిగించాలన్నారు.
- గుంతకల్, విజయవాడ, గుంటూరు డివిజన్లు సౌత్‌కోస్ట్ రైల్వేలో విలీనం అవుతున్నందున్న సౌత్ సెంట్రల్ రైల్వేకు నష్టం కలుగుతుందని కొత్త రైల్వే మార్గాలను వేయాల్సిన అవసరం ఉందన్నారు.
- మంత్రాలయం నుంచి కర్నూల్ వరకు రైల్వే మార్గం నిర్మించడం వలన వ్యవసాయ ఉత్పత్తులను నగరానికి తరలించడానికి అవకాశం ఉందన్నారు.

నిరసన తెలిపే హక్కులను కాలరాయడం సరికాదు

జవహర్‌నగర్: ప్రజాస్వామ్యంలో ప్రజలు నిరసన తెలిపే హక్కులను కాలరాయడం సరికాదని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. వరంగల్ సభను తెలంగాణ ప్రభుత్వం భగ్నం చేయడాన్ని నిరసిస్తూ.. ఆదివాసీల హక్కుల నేతలు ఇచ్చిన పిలుపులో భాగంగా జవహర్‌నగర్‌లో పీవోడబ్ల్యూ (విముక్తి) నాయకులు చుక్క కళ ఆధ్వర్యంలో ఆదివారం ప్రజా సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఆదివాసీ హక్కుల సంఘీభావ వేదికను విజయవంతం చేయాలని, గత నెలరోజులుగా అన్ని ఏర్పాట్లు చేసుకుంటే రాష్ట్ర ప్రభుత్వం సభకు అనుమతి లేదని చెప్పడం సరికాదన్నారు. షేక్ షావలి, సావిత్రి, మహ్మద్ రషీద్, సునీత తదితరులున్నారు.